క్లుప్తంగా

సారూ మా ఊరికి బస్సు వేయరూ..



విప్‌కు వినతి పత్రం అందిస్తున్న మహిళలు

బుగ్గారం: సారూ మా ఊరికి బస్సు వేయరూ అంటూ ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు యశ్వంతరావుపేట గ్రామస్తులు సోమవారం వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామానికి డబుల్ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ బస్సు సౌకర్యం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని విప్‌కు మొరపెట్టుకున్నారు. జిల్లా కేంద్రానికి,ఇతర గ్రామాలకు వెళ్లాలంటే ప్రధాన రహదారి వరకు నడుచుకుంటూనే రావాల్సి వస్తుందని వాపోయారు. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, విద్యార్థులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఇకనైనా తమ సమస్యను అర్థం చేసుకుని తమ గ్రామానికి బస్సును నడిపించాలని కోరారు.

బీరయ్య గుడి వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు



ఎమ్మెల్యేను కలిసిన కురుమ సంఘం సభ్యులు

మల్యాల: మండలంలోని మానాలలో బీరయ్య ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు సోమవారం ఉదయం విన్నవించుకోగానే స్పందించిన ఎమ్మెల్యే సత్యం హైమాస్ట్ లైట్లు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేయగా, బీరయ్య గుడి వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేసినందుకు కురుమ సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు అప్పాల ముత్తయ్య, గుంటి నరేశ్, శెట్టి తిరుపతి, గుంటి విజయ్, బత్తిని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'మేడిపల్లి' కి మంత్రి పదవి రావాలని చీటీ

మల్యాల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నకు మంత్రి పదవి రావాలని, మంత్రి పదవి వస్తే కుటుంబసమేతంగా పాదయాత్ర వచ్చి దర్శించుకుంటామని ఓ భక్తుడు చీటీ రాసి హుండీలో వేశాడు. సోమవారం కొండగట్టులో హుండీ లెక్కింపులో చీటీ బయటపడింది. స్వామి ఆశీర్వాదంతో పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారని, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నకు మంత్రి పదవి వచ్చేలా ఆశీర్వదించు స్వామి అని చీటీలో రాశాడు. మేడిపల్లి సత్యం అన్నకు మంత్రి పదవి వస్తే కుటుంబ సమేతంగా కొండగట్టుకు పాదయాత్రగా వచ్చిన మొక్కులు చెల్లించుకుంటామని చీటీలో పేర్కొన్నాడు.

కేజీబీవీ విద్యార్థులకు డీఈవో అభినందన



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో రాము

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు కేజీబీవీ పాఠశాలలో చదివి ఇంటర్, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన చంద్రకళ, బొంత సాత్విక, జంగ సాహిత్యలను డీఈవో రాము, స్టేట్ కో–ఆర్డినేటర్ శిరీష, డీసీడీవో అనుపమ అభినందించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు బడిబాట



బడిబాటలో ఉపాధ్యాయులు

కథలాపూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు సోమవారం ముందస్తు బడిబాట నిర్వహించారు. ఉపాధ్యాయులు ఆయా వాడల్లో ర్యాలీ తీశారు. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి కొత్త అడ్మిషన్లు తీసుకున్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం మారంపెల్లి అర్జున్, సీఆర్‌పీలు గణేశ్, రాజేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరాములోరి బ్రహ్మోత్సవాలు



సత్యనారాయణ స్వామి వ్రత పూజలో భక్తులు

కథలాపూర్: మండలంలోని దూలూర్‌లో వారం రోజులుగా నిర్వహిస్తున్న శ్రీరాములోరి బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. సోమవారం ఆలయంలో సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. స్వామివారికి పంచమ దివస చక్రస్నానం చేయించారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లక్ష్మీనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోమేశ్వర స్వామికి భక్తుల పూజలు

మల్లాపూర్: మండల కేంద్రంలోని సోమేశ్వర కొండపై సోమవారం భక్తుల సందడి నెలకొంది. మల్లాపూర్‌తో పాటు చుట్టు పక్కల గ్రామాలు, మండలాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఇబ్రహీంపట్నం మండలం గోధూర్ గ్రామానికి చెందిన సోల్లేటి శ్రీనివాస్–విజయ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అర్చకులు బల్యాపెల్లి ప్రభాకర్‌శర్మ, ఆలయ కమిటీ చైర్మన్ సంగ రాజన్న, వైస్ చైర్మన్ ఇల్లెందుల తుక్కారాం, సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

జగిత్యాలరూరల్: మండలంలోని చల్‌గల్‌లో జరిగిన శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవంలో సోమవారం మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జున్ను రాజేందర్, గంగారెడ్డి, నాయకులు పదాల నరేశ్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సహస్ర లింగాల ఆలయంలో అన్నపూజ



సహస్ర ఆలయంలో అన్నపూజలో పాల్గొన్న భక్తులు

జగిత్యాలరూరల్: మండలంలోని పొలాస సహస్ర లింగాల ఆలయంలో సోమవారం వేద పండితుల ఆధ్వర్యంలో అన్నపూజ కార్యక్రమం నిర్వహించారు. వేలాది మంది భక్తులు అన్నపూజలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలమాసు గంగాధర్, భక్తులు పాల్గొన్నారు.

క్లిష్టమైన ఆపరేషన్లు



తల్లిబిడ్డలతో వైద్యురాలు రజిత, సూపరింటెండెంట్

రాయికల్: రాయికల్ ప్రభుత్వ ఆస్పత్రిలో రామాజీపేట గ్రామానికి చెందిన జ్యోతి, చెర్లకొండాపూర్ గ్రామానికి చెందిన ఉమ అనే గర్భిణులకు సోమవారం క్లిష్టమైన పరిస్థితుల్లో ఆపరేషన్ చేశారు. ఇద్దరికీ కుమారులు జన్మించారని, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు సూపరింటెండెంట్ శశికాంత్‌రెడ్డి తెలిపారు. ఆపరేషన్లు చేసిన వైద్యురాలు ఒడ్నాల రజితను అభినందించారు.

పాలన వైఫల్యంతో ప్రజలకు ఇబ్బందులు

మల్లాపూర్/ఇబ్రహీంపట్నం: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ పాలన వైఫల్యంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. 16 నెలల పాలనతో రాష్ట్రం పదేళ్ల వెనక్కి వెళ్లిందన్నారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట శ్రీనివాస్, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సరోజన, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

ఇబ్రహీంపట్నంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో రసాభస నెలకొంది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆడబిడ్డ పెళ్లికి గత ప్రభుత్వం కల్యాణలక్ష్మి తెచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని చెప్పి అమలు చేయడం లేదని, నలుగురు కలిసిన ప్రతిచోటా తులం బంగారం గురించే చర్చించుకుంటున్నారని తెలిపారు. వేములకుర్తికి చెందిన కుంబాల రాజం మాట్లాడుతూ.. ఉచిత బస్సు అనగానే మహిళలు కాంగ్రెస్‌కు ఓట్లేశారని, ఇప్పుడేం లాభం లేదని, మళ్లీ కేసీఆర్ సీఎం కావాలని అనడంతో బీఆర్‌ఎస్ కార్యకర్తలు చప్పట్లు కొట్టారు. అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు పార్టీకి అనుకూలంగా నినాదాలు చేయడంతో రసాభాసగా మారింది. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులతో వాగ్వివాదానికి దిగారు. ఎమ్మెల్యే ఇరువురిని శాంతింపచేశారు. వేదికపై ఉన్న మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ వెంకటరెడ్డిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎవరినీ విమర్శించలేదని, కావాలనే గొడవ సృష్టించారని, ఇది మంచి పద్ధతి కాదన్నారు.



ఇబ్రహీంపట్నంలో కాంగ్రెస్,బీఆర్‌ఎస్ నాయకుల మధ్య వాగ్వివాదం

తాగునీరు నిరంతరం అందించాలి

వేసవిలో అంతరాయం లేకుండ తాగునీటిని అందించాలని ఎమ్మెల్యే మిషన్‌భగీరథ అధికారులను కోరారు. మండలంలోని డబ్బా గ్రామంలో వాటర్ గ్రిడ్‌ను సందర్శించారు. ఎస్సారెస్పీ జలాల్‌పూర్ నుంచి పంపింగ్ ద్వారా వాటర్‌గ్రిడ్‌కు చేరగానే ప్రతిరోజు 50 లక్షల లీటర్లు ఫిల్టర్ చేస్తూ జిల్లాలోని అన్ని గ్రామాలకు సరాఫరా చేస్తున్నట్లు అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. మిషన్ భగీరథ పంప్ ఆపరేటర్లు తమకు మూడు నెలలుగా జీతాలు రావడం లేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో కంపెనీ మేనేజర్ సందీప్‌తో ఫోన్‌లో మాట్లాడి పంపు జీతాలు చెల్లించాలని ఆదేశించారు.

జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలి

సారంగాపూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు తీసుకోవాలని కళాశాల అధ్యాపకులు కోరారు. సోమవారం మండలంలోని రేచపల్లిలో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి కళాశాలలో చేరాలని కోరారు. విద్యార్థుల తల్లితండ్రులను కలిసి జూనియర్ కళాశాలలో అందుతున్న విద్యపై వివరిస్తున్నారు. ఇప్పటి వరకు సారంగాపూర్ కళాశాలలో చదివిన విద్యార్థులు సాధించిన విజయాలను వివరిస్తూ అడ్మిషన్లు తీసుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై. రమేష్‌బాబు, అధ్యాపకులు శ్రీధర్, రాజు, సౌజన్య, సుజాత, వెంకటేశ్వర్లు, సంపత్‌రావు, శ్రావణ్ ఆర్య ఉన్నారు.

పనితీరుకే పట్టం

వెల్గటూర్ : పార్టీలో పనితీరును బట్టే పదవులు లభిస్తాయని బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు అన్నారు. జిల్లాలో పలు మండలాలకు బీజేపీ నూతన అధ్యక్షులను సోమవారం నియమించారు. వెల్గటూర్ మండల నూతన అధ్యక్షుడిగా గోపతి జనార్దన్‌ను రెండో సారి నియమించారు. తనపై నమ్మకంతో రెండోసారి అధ్యక్షుడిగా నియమించినందుకు పార్టీ జిల్లా అధ్యక్షులు యాదగిరి బాబుకు, మాజీ జిల్లా అధ్యక్షుడు మోరపల్లి సత్యనారాయణరావుకు జనార్ధన్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

పాకిస్తాన్ పౌరులను దేశం నుంచి పంపించాలి

మల్యాల: భారత దేశంలో నివాసముంటున్న పాకిస్తాన్ దేశీయులను గుర్తించి, ఆ దేశానికి పంపించాలని బీజేపీ నాయకులు కోరారు. బీజేపీ మండలాధ్యక్షుడు గాజుల మల్లేశం ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌ఐ రాణికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కొల్లూరి గంగాధర్, బొబ్బిలి వెంకటస్వామి, కెల్లేటి రమేశ్, నల్ల జీవన్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి: స్థానికంగా నివాసముంటున్న పాకిస్తాన్ పౌరులను గుర్తించి వారిని దేశం నుంచి పంపేయాలని కోరుతూ సోమవారం మేడిపల్లి తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కరీంనగర్ కన్వీనర్ క్యాతం దశరథరెడ్డి, మండల అధ్యక్షుడు ముంజ శ్రీనివాస్,నాయకులు పాల్గొన్నారు.



కథలాపూర్ వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

కథలాపూర్: దేశంలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులను బహిష్కరించాలని కోరుతూ కథలాపూర్‌లో తహసీల్దార్‌కు బీజేపీ నాయకులు సోమవారం వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మల్యాల మారుతి, నాయకులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్లకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: సీనియర్ సిటిజన్లకు అండగా ఉంటానని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్‌కు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో యాస్మిన్ బాషా కలెక్టర్‌గా ఉన్న సమయంలో ఆర్డీవో కార్యాలయంలో ఉన్న భవనానికి నిధులు మంజూరు చేయించి కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, హన్మంతరెడ్డి, విఠల్, ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

సంఘ భవనానికి స్థలం కేటాయించాలి

జిల్లా కేంద్రంలోని పేయింటర్స్ అసోసియేషన్ సంఘ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవనానికి స్థలం కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

డ్రంకెన్‌డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణంలో గత కొద్దిరోజుల క్రితం విస్తృత వాహనాల తనిఖీ చేపట్టగా, రాయికల్ మండలం అయోధ్య గ్రామానికి చెందిన వరికొప్పుల పర్శరాం అతిగా మద్యం తాగి పట్టుబడగా, పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుడిని సోమవారం కోర్టులో ప్రవేశపెట్టగా స్పెషల్ జ్యుడీషియల్ సెకెండ్‌క్లాస్ మేజిస్ట్రేట్ కరుణాకర్ నిందితుడికి రెండు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు సంప్రదించాలి

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకయ్య తెలిపారు. స్థానిక కళాశాలలో బీఏ, బీకాం(కంప్యూటర్స్) కోర్సులు ఉన్నాయని, వీటినిలో అడ్మిషన్లు పొందడానికి 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్‌తో కళాశాలలో సంప్రదిస్తే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామన్నారు. పూర్తి వివరాలకు 9440142069, 9951118565 అనే నెంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

జగిత్యాల: వడదెబ్బ తగలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లత అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నేషనల్ ప్రోగ్రాం ఫర్ క్లమేట్ చేంజ్ ఆన్ హ్యూమన్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తప్పని పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని, ఒకవేళ వెళ్లాల్సి వస్తే తలకు టోపీలు గానీ, టవల్స్ గానీ కట్టుకుని వెళ్లాలని సూచించారు. మంచినీరు ఎక్కువగా తాగి డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ అర్చన, పంచాయతీ అధికారి మదన్‌మోహన్, డీఆర్డీవో రఘువరన్, హెల్త్ ఎడ్యుకేటర్ తరాల శంకర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న అడిషనల్ కలెక్టర్, వైద్యాధికారులు

ఆధార్ తరహాలోనే రైతులకు భూధార్

మల్లాపూర్: ఆధార్ తరహాలోనే భూధార్ పేరిట ప్రతి భూ కమతానికి ఓ ప్రత్యేకమైన నంబర్ కేటాయించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి(ఏవో)లావణ్య అన్నారు. సోమవారం మల్లాపూర్, మొగిలిపేట, కొత్తదాంరాజుపల్లి, సిరిపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన సమావేశాల్లో భూధార్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూధార్‌తో భూ ఆక్రమణలు, వివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు, భరోసా లభిస్తుందన్నారు. ఎ భూధార్‌కార్డు ద్వారా 14 నంబర్లతో విశిష్ట సంఖ్య ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. దీనికోసం వ్యవసాయ విస్తరణ అధికారిని లేదా మీ సేవలో చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో గజానంద్, రైతులు పాల్గొన్నారు.

డిజిటలైజేషన్‌తో వ్యవసాయరంగం అభివృద్ధి

బుగ్గారం: దేశంలోని ప్రతీ రైతుకు 14 అంకెలతో కూడిన ప్రత్యేకమైన విశిష్ట గుర్తింపు సంఖ్యను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు బుగ్గారం మండల వ్యవసాయ అధికారి అక్షిత తెలిపారు. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను చేపట్టిందన్నారు. దీనికోసం రైతులు ఏఈవోలను సంప్రదించాలని తెలిపారు. మీ సేవా కేంద్రాల్లో కూడా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని అన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో

గొర్రెల కాపరులు, మహిళలు అప్రమత్తంగా ఉండాలి

మల్యాల: జిల్లాలోని పలు గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు గొర్రెలు, మేకలు చోరీ చేస్తున్న నేపథ్యంలో గొర్రె కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై నరేశ్ కోరారు. గ్రామాల్లో గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌లపై సంచరిస్తూ, నిర్మానుష్యమైన ప్రదేశాల్లో ఒంటరిగా ఉన్న మహిళల మెడల్లోంచి బంగారు నగలు ఎత్తుకెళ్తున్నారని, ఎవరైనా అనుమానితులు, గుర్తు తెలియని వ్యక్తులు గ్రామాలకు వస్తే సమాచారం ఇవ్వాలని పేర్కొన్నారు. అడ్రస్ కోసమంటూ మహిళల దగ్గరికి వస్తే, అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు.

ఆర్థికసాయం

కథలాపూర్: మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన గుంట హన్మంతు అనే వ్యక్తి సౌదీ అరేబియా దేశంలో మృతిచెందగా.. బాధిత కుటుంబానికి ఈ ప్రాంత ఎన్‌ఆర్‌ఐ నాయకులు రూ. 76,500 ఆర్థికసాయం సోమవారం అందించారు. గల్ఫ్‌లో ఉంటున్న ఈ ప్రాంత వాసులు డబ్బులు పోగు చేయగా రూ. 76,500 వచ్చాయన్నారు. వీటిని బాధిత కుటుంబానికి అందించారు.

వసంత కుటుంబాన్ని ఆదుకుంటాం

కోరుట్ల: ఇటీవల పోలీసులకు లొంగిపోయిన మావోయిస్టు పసుల వసంత కుటుంబాన్ని ఆదుకుంటామని కోరుట్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. సోమవారం ఆయన కోరుట్లలోని పసుల వసంత ఇంటికి వెళ్లి ఆమె పరిస్థితిని సమీక్షించారు. సుమారు 40 ఏళ్లు మావోయిస్టుగా అజ్ఞాతంలో కాలం గడిపిన వసంతకు కనీసం ఆధార్ కార్డు లేదని ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడినట్లు ఆయన తెలిపారు. భర్త పసుల రాంరెడ్డితో పాటు చిన్న వయసులతో మావోయిస్టు ఉద్యమంలో చేరిన వసంత జనజీవన స్రవంతిలోకి రావడం ఆశించదగ్గ పరిణామమన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేయిస్తున్న పునరావాస సహాయం తప్పకుండా అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల వ్యవధిలో జిల్లా కలెక్టర్‌ను కలిసి ఆధార్ కార్డు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. వసంత పేరు మీద ఉన్న రివార్డులు ఆమెకు అందేలా ఉన్నతాధికారులతో మాట్లాడతానన్నారు. కార్యక్రమంలో మావోయిస్టు వసంత కూతురు భవానీ, కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, పసుల కృష్ణప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజిరెడ్డి, ఆడెపు మధు, ఎంబేరి నాగభూషణం, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



వసంతతో మాట్లాడుతున్న నర్సింగరావు

మెరుగైన విద్యుత్ సరఫరా కోసమే పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఇబ్రహీంపట్నం: మెరుగైన విద్యుత్ సరఫరా చేసేందుకే పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను అమరుస్తున్నామని ఎస్‌ఈ సల్యానాయక్ అన్నారు. సోమవారం మండలంలోని గోధూర్ సబ్‌స్టేషన్‌లో 3.15 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో రూ. 85 లక్షలతో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చగా ఆయన ప్రారంభించి మాట్లాడారు. సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ అమర్చడం వలన గోధూర్, తిమ్మాపూర్ గ్రామాల రైతులు, పరిశ్రమలకు లో వోల్టేజీ సమస్య లేకుండా, ఓవర్‌లోడ్ లేకుండా నిరంతరంగా విద్యుత్ సరఫరాను చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డీఈ అపరేషన్ గంగారం ఎంఆర్‌టీ డీఈ రవీందర్, ఏడీఈలు రాజు, మనోహర్, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.

పంటల మార్పిడిపై అవగాహన

మల్యాల: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్తంగా చేపట్టిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా సోమవారం మల్యాల మండలం రామన్నపేటలో రైతులకు నీటి యాజమాన్యం, పంటల మార్పిడిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ రజనీకాంత్ నీటి యాజమాన్యం, పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించగా, శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సాయినాథ్ అధిక నత్రజని రసాయన ఎరువుల వినియోగంలో కలిగే నష్టాలు వివరించారు. రైతులు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో చంద్రదీపక్, ఏఈవోలు మంజుల, కారుణ్యకుమార్, రైతులు పాల్గొన్నారు.

పారా వెటర్నరీయన్స్ నిరసన

జగిత్యాల: పశువైద్య పశుసంవర్ధక శాఖలో టీఎన్జీవో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పారా వెటర్నరీయన్స్ నిరసన తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ కృష్ణమాచారిపై వెటర్నరీ అసిస్టెంట్ సర్జన వెంకటియాదవ్ అసభ్య పదజాలంతో దూషించాడని, దీనిని ఖండిస్తూ జిల్లాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తక్షణమే ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ నాన్‌గెజిటెడ్ వెటర్నరియన్స్ జిల్లా అధ్యక్షుడు కందుకూరి పూర్ణచందర్, కార్యదర్శి నాగేందర్‌రెడ్డి, కోశాధికారి గణేశ్ పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం చేయాలి

రాయికల్: సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేయాలని, అప్పుడే దిగుబడి ఎక్కువ వస్తుందని, పంట నాణ్యతగా ఉంటుందని శాస్త్రవేత్త డాక్టర్ రవి అన్నారు. సోమవారం రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో రైతు ముంగిట శాస్త్రవేత్త కార్యక్రమంలో భాగంగా రైతులకు పొలాసకు చెందిన శాస్త్రవేత్తలకు వివిధ రకాల పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో ముక్తేశ్వర్, సింగిల్ విండో చైర్మన్ రాజలింగం పాల్గొన్నారు.

ఇక ఫార్మసీ ఆఫీసర్లు

జగిత్యాల: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఫార్మాసిస్టలను ఫార్మసీ ఆఫీసర్‌గా పేరు మార్చుతూ జీవో 71 జారీ చేయడంతో ఫార్మాసిస్టల సంఘం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఫార్మాసిస్టలు డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, అర్చనలను శాలువాలతో సత్కరించారు. వైద్య శాఖలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమైందని, డీఎంహెచ్‌ఎంలో అన్నారు. కార్యక్రమంలో ఫార్మసీ ఆఫీసర్లు రాధ, శ్రీనివాస్, షౌకత్ అలీ, భాగ్యలక్ష్మి, మహేశ్వరి, శ్రీలత, చిరంజీవి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కోరుట్ల రూరల్: మండలంలోని పైడిమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998–99లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం అమ్మవారి మఠ్రి వద్ద ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. చిన్న నాటి జ్ఞాపకాలను నెమరేసుకుని, ఆడుతూ, పాడుతూ ఉత్సాహంగా గడిపారు. వారానికి ఒక మొక్క నాటి సంరక్షించాలని ప్రతిజ్ఞ చేశారు. నాటిన మొక్కలను గ్రూప్‌లో షేర్ చేసుకోవాలని తీర్మానించుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.